సాక్షి
సిద్దిపేట
ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



డ్రగ్స్ ముఠా అరెస్టు

కొత్త సంవత్సర వేడుకల కోసం హైదరాబాద్‌లో డ్రగ్స్ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న అంతరాష్ట్ర డ్రగ్స్ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వివరాలు 8లో ▸



కేజీబీవీలో సమస్యలు..

కేజీబీవీలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. వివరాలు 9లో ▸



పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

పౌష్టకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. పాఠశాలల్లో పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

మల్లన్న సన్నిధిలో ప్రముఖులు



రాచకొండ డీసీపీని సత్కరిస్తున్న ఆలయ అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామిని శనివారం రాచకొండ డీసీపీ సూరుకంటి మల్లారెడ్డి, సినీనటుడు సెల్వరాజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, ఆలయ ప్రధానార్చకులు పాల్గొన్నారు.

శిశుగృహంలో పసికందులు



సిద్దిపేటరూరల్: ఇటీవల లభించిన పసికందులను సంరక్షణ నిమిత్తం శిశుగృహంలో చేర్పించనట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి శారద శనివారం తెలిపారు. సంబంధిత పసికందుల తల్లిదండ్రులు 30 రోజులలోపు సరైన ధ్రువపత్రాలు జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో చూపించి తీసుకెళ్లాలన్నారు. దత్తత తీసుకునే వారు సైతం సంప్రదించవచ్చన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆదర్శ పాఠశాలల్లోని 6వ, 7వ తరగతుల్లో అడ్మిషన్లకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను జనవరి 6 నుంచి ఫిబ్రవరి 28వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సంబంధిత ఆదర్శపాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలన్నారు.


సమగ్ర శిక్షా ఉద్యోగుల వినూత్న నిరసన



ఆర్ట్‌గ్యాలరీలతో సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

సిద్దిపేటరూరల్: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు వినూత్నంగా నిరసన తెలిపారు. 12వ రోజు శనివారం పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు వేసిన ఆర్ట్ గ్యాలరీలను తీసుకువచ్చి కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, ప్రధానకార్యదర్శి నవీన్, కోశాధికారి కరుణాకర్, రాష్ట్ర నాయకులు సురేందర్, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించండి



ఐఓసీ ఎదుట ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు

గజ్వేల్‌రూరల్: గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య పనులు చేపట్టే కార్మికుల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని ఐఓసీ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీఓ చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎల్లయ్య మాట్లాడుతూ జీపీ కార్మికులకు సకాలంలో వేతనాలు రాకపోవడంతో చాలీచాలని వేతనాలతో అప్పులు చేసి తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వేతనాలు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు.

'ధ్యానం' తప్పనిసరి

గజ్వేల్‌రూరల్: ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని పీఎస్ఎస్ఎం (పిరమిడ్ స్పిరచ్యువల్ సొసైటీ ఆఫ్ మూవ్‌మెంట్) గజ్వేల్ శాఖ అధ్యక్షుడు పి.నర్సింహులు అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని సూర్య నమస్కారాల బృందం ఆధ్వర్యంలో ధ్యానం చేశారు. ఆయన మాట్లాడుతూ...ధ్యానం చేసేందుకు వయసుతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరూ చేయవచ్చన్నారు. పీఎస్ఎస్ఎం ఆధ్వర్యంలో, గజ్వేల్ పట్టణంలోని సర్వాత్మ పిరమిడ్ ధ్యాన మందిరంలో ఉచితంగా ధ్యానం నేర్పిస్తున్నారని ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.

● ధ్యానం.. ప్రశాంత జీవన యానం

ప్రపంచ ధ్యాన దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో పలుచోట్ల ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసు కమిషనర్ కార్యాలయ ఆవరణలో శనివారం పోలీసు అధికారులు, సిబ్బంది ధ్యానం, యోగాసనాలు వేశారు. అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ప్రశాంతతకు ధ్యానం, యోగా తప్పనిసరి అని అన్నారు. కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని వ్యాసమహర్షి యోగా సొసైటీ, భారత స్వాభిమాన్ ట్రస్ట్‌తో పాటుగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో ధ్యాన్య దినోత్సవాన్ని నిర్వహించారు. వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, భారతస్వాభిమాన్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రాములు, యోగా శిక్షకులు తోట సతీష్‌లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజూ కనీసం 15 నిమిషాలు ధ్యానం అలవాటు చేసుకుంటే ఆత్మవిశ్వాసం, మానసిక ప్రశాంతత పెరుగుతుందన్నారు


– సిద్దిపేటకమాన్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయ ఆవరణలో ధ్యానం చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది



ధ్యాన ముద్రలో వ్యాస మహర్షి, స్వాభిమాన్ ట్రస్ట్ నిర్వాహకులు



సండే స్పెషల్

చిక్కు వీడితే.. లెక్క తేలికే

అర్థం చేసుకుంటే చాలా సులువు.. మిస్టరీ అంతకంటే కాదు.. నేర్చుకుంటే చాలా ఈజీ.. అదే గణితం. లెక్కలు అనగానే విద్యార్థుల్లో ఏదో తెలియని భయం. పరీక్షలు అనగానే ఆత్మ నూన్యతా భావం. గణితం అంటే భయమా..? అంటే కాదనే చెబుతున్నారు గణిత నిపుణులు. ప్రముఖ గణితవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణితంలో రాణిస్తున్న విద్యార్థులు, వారికి సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్న ఉపాధ్యాయులు, సైన్స్ ఫెయిర్లలో జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థుల ప్రాజెక్ట్‌లపై ఈ వారం 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

జోరుగా మత్తు దందా..!

జిల్లాలో నిషేధిత మత్తు పదార్థాల దందా జోరుగా సాగుతోంది. కృత్రిమ కల్లు తయారీలో ఉపయోగించేందుకు అల్ప్రాజోలంను యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. జిల్లాలో కల్తీ కల్లు మాఫియా ఈ మత్తు మందును వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లా బోధన్‌లో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించడంలో అల్ప్రాజోలం పట్టుకున్నారు. నిందితులను ఆరాతీయగా సిద్దిపేటకు సైతం సరఫరా చేస్తున్నట్లు చెప్పడంతో స్థానిక ఎక్సైజ్ అధికారులను టాస్క్‌ఫోర్స్ అధికారులు అలర్ట్ చేశారు. ఇటీవల పట్టణ శివారులో 4కిలోల అల్ప్రాజోలం పట్టుబడటం కలకలం రేపుతోంది.

జిల్లాలో యథేచ్ఛగా విక్రయాలు

- ఇటీవల పట్టుబడిన 4 కిలోల అల్ప్రాజోలం
- మహారాష్ట్ర నుంచి సిద్దిపేటకు రవాణా
- కల్తీ కల్లు తయారీకి వినియోగించేందుకేనా?
- అంతంతమాత్రంగానే తనిఖీలు



అల్ప్రాజోలంతో పాటు నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

సాక్షి, సిద్దిపేట: జిల్లా వ్యాప్తంగా తాటి, ఈత చెట్లు కలిపి 2,44,950 ఉన్నాయి. జిల్లాలో కల్లు గీత కార్మికుల సొసైటీలు 210 ఉండగా కల్లు విక్రయ కేంద్రాలు 385 ఉన్నాయి. ఈత, తాటి వనాలు ఉన్నప్పటికీ కల్తీ కల్లు ఏరులైపారుతోంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప అధికారుల్లో కదలిక రావడం లేదు. ఒక వేళ వచ్చినా తూతూమంత్రంగా తనిఖీలు...శాంపిళ్ల సేకరణకే పరిమితం అమవుతున్నారు. మద్యం ధరలు అధికంగా ఉండటంతో కల్లునే ఎక్కువ మంది సేవిస్తున్నారు. దీంతో కల్లును హానికరమైన రసాయనాలతో తయారు చేస్తూ ప్రజలకు అంటగడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ కల్లుకు యువకులు, కూలీలు బానిసలవుతున్నారు.

నెల రోజులకు పరీక్ష..

ఎక్సైజ్ శాఖ సేకరించిన శాంపిళ్లను స్థానిక కోర్టులో డిపాజిట్ చేయాలి. కోర్టు వారు వాటిని పరిశీలించి నిజామాబాద్ ల్యాబ్‌కు రెఫర్ చేస్తారు. సేకరించిన రోజు నుంచి సుమారుగా ఐదు రోజులకు కల్లు శాంపిళ్లు నిజామాబాద్ ల్యాబ్‌కు చేరుతాయి. ఈ ల్యాబ్ సుమారు10 జిల్లాలకు ఒక్కటే ఉంది. ఆయా జిల్లాల నుంచి శాంపిల్స్ సైతం వస్తుంటాయి. ఇక్కడి నుంచి సేకరించిన కల్లును టెస్ట్ చేసేందుకు నెల రోజులు పడుతోంది. అప్పటి వరకు అందులో ఉండే మత్తు పదార్థాలు పవర్ లేకుండా పోతోందని పలువురు అంటున్నారు. దీంతో టెస్ట్ చేస్తే ఎలాంటి మత్తు పదార్థాలు కలపలేదని రిపోర్ట్ వస్తుందని చెబుతున్నారు. మరోవైపు నిజామాబాద్ ల్యాబ్ వారితో ఆయా కల్లు డిపోల వారికి లింకులు ఉన్నట్లు సమాచారం.

మహారాష్ట్ర నుంచి సిద్దిపేటకు..

మెడిసిన్‌లలో మాత్రమే వినియోగించాల్సిన అల్ప్రాజోలం మత్తు పదార్థాలను మహారాష్ట్ర నుంచి జిల్లాకు అక్రమ రవాణా చేస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా తమ స్థావరాలకు చేరవేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహరించడం పరిపాటిగా మారింది. ఇప్పటికైన ఎక్సైజ్ శాఖ స్పందించి కృత్రిమ కల్లు తయారీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దుష్పరిణామాలు

కల్తీ కల్లులో కలిపే రసాయనాల వల్ల దుష్పరిణామాలు చూపుతున్నాయి. ప్రభుత్వ నిషేధించిన క్లోరల్ హైడ్రేట్, అల్ప్రాజోలం, డైజోఫాం ఇతరత్రా మత్తు పదార్థాలను వినియోగిస్తున్నారు. వీటికి బానిసైన వారిలో ఏకాగ్రత మందగించడం, మెదడు, నరాలపై తీవ్ర ప్రభావం చూపడం, మూత్రపిండాలు, కాలేయం దెబ్బతింటున్నాయని వైద్యులు చెబుతున్నారు.

కల్తీ కల్లు తయారు చేసేందుకే?..

జిల్లాలో ఈనెల 13న సిద్దిపేట నుంచి కిష్టాపూర్‌కు తరలిస్తున్న క్రమంలో 2.5కిలో అల్ప్రాజోలం పట్టుకున్నారు. ఈ నెల 16న పట్టణంలోని కాకతీయ కాలనీలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 1.5కిలో అల్ప్రాజోలంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేయగా మరో నిందితుడు పరారీలో ఉన్నారు. మూడు రోజుల వ్యవధిలోనే 4కిలోల అల్ప్రాజోలం పట్టుకోగా దీని విలువ సుమారు రూ.40లక్షల వరకు ఉంటుందని సమాచారం. జిల్లాకు యథేచ్ఛగా మత్తు మందు సరఫరా అవుతున్నా ఎక్సైజ్ అదికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు అంటున్నారు.. ఈ అల్ప్రాజోలం కల్లు డిపోలకు తరలించి కల్తీ కల్లులో వినియోగించుకునేందుకే అక్రమ రవాణా చేస్తున్నారని తెలుస్తోంది.



స్వాధీనం చేసుకున్న అల్ప్రాజోలం

నిఘా పెంచాం..



ఇటీవల అల్ప్రాజోలం పట్టుపడటంతో జిల్లా వ్యాప్తంగా నిఘా పెంచాం. దీని వెనుక ముఠా ఉందన్న అనుమానంతో కూపీ లాగుతున్నాం. మత్తు పదార్థాలను సరఫరా చేసినా, విక్రయించినా ఎంతటి వారైనా వదలం. మత్తు పదార్థాలతో ఎలాంటివి తయారు చేయవద్దు.

- శ్రీనివాసమూర్తి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

పెండింగ్ కేసులన్నీ పరిష్కరించండి

- సీపీ అనురాధ
- పోలీస్ అధికారులతో సమీక్ష

సిద్దిపేటకమాన్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులన్నీ త్వరగా పరిష్కరించాలని సీపీ అనురాధ సూచించారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో పోలీసు అధికారులతో సీపీ శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసులన్నీ పరిశోధన చేసి ఫైనల్ చేయాలని సూచించారు. ఉమెన్ మిస్సింగ్ కేసులను త్వరగా ఛేదించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నాన్ బెయిలబుల్ వారెంట్స్ సాధ్యమైనంత త్వరగా కొలిక్కి తీసుకురవాలన్నారు. సైబర్ నేరాలు, అభయ యాప్, డ్రగ్ మత్తు పదార్థాలపై యువత, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఏసీపీలు మధు, పురుషోత్తంరెడ్డి, సతీష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు, టూటౌన్ సీఐ ఉపేందర్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సాంకేతిక రంగంలో గణితం కీలకం

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): సాంకేతిక రంగం రాకెట్‌లా దూసుకెళ్లేందుకు గణితం దోహదపడుతుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొండపాక, కుకునూరుపల్లి మండలాల వ్యాప్తంగా గణిత మేళాలను నిర్వహించారు. ఖమ్మంపల్లిలోని పాఠశాలలో గణిత మేళాను డీఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మనస్సు పెడితే గణితం ఈజీగా ఉంటుందన్నారు. విద్యార్థులు తయారు చేసిన పలు రకాల ఎగ్జిబిట్లను చూసి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, నోడల్ అధికారి విఠల్, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోటీ తత్వం అలవరుచుకోవాలి

చేర్యాల(సిద్దిపేట): విద్యార్థులు సృజనాత్మకత, క్రమశిక్షణ, నైతిక విలువలతో పాటు పోటీతత్వాన్ని అలవరుచుకోవాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ముస్త్యాల మోడల్‌స్కూల్‌లో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందకు ఏఈఓ రచ్చ కిష్టయ్య నిర్వహించిన క్విజ్ పోటీలు అభినందనీయమని కొనియాడారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



ఖమ్మంపల్లి హైస్కూల్లో త్రికోణమితి ఎగ్జిబిట్‌ను పరిశీలిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

మంచు కురిసింది.. మనసు మురిసింది



పల్లెను కమ్మేసిన పొగ మంచు

పొగ మంచు పల్లెలను కమ్మేసింది. శనివారం వాగు వంకలన్నీ మంచుతో నిండిపోవడంతో ప్రకృతి అందాలు ఊటిని తలపించాయి. పట్టణాల్లో ప్రధాన రహదారులన్నీ పొగ మంచుమయం కావడంతో వాహనాల లైట్ల వెలుతురులో వాహనదారులు ప్రయాణించాల్సి వచ్చింది. మంచు పొరల్లో ఉదయ భానుడు చందమామను తలపిస్తూ వెలిగిపోయాడు.

– మిరుదొడ్డి(దుబ్బాక)



ఊటిని తలపిస్తున్న ప్రకృతి అందాలు

మెతుకుసీమకు ప్రముఖుల రాక

నేడు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- 25న ఉపరాష్ట్రపతి, సీఎం రేవంత్‌రెడ్డి
- ఖరారైన షెడ్యూల్.. ఏర్పాట్లలో అధికారుల నిమగ్నం

మెదక్‌జోన్: మెతుకుసీమకు ప్రముఖులు క్యూ కడుతున్నారు. ఆదివారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్‌ఐ చర్చిని సందర్శించనున్నారు. చర్చి నిర్మించి వందేళ్లు పూర్తికావడంతో చరిత్ర తెలుసుకొని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. అనంతరం కొల్చారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేయనున్నారు. అలాగే ఈనెల 25వ తేదీ క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ చర్చిని సందర్శించి వందేళ్ల ఉత్సవాల్లో పాల్గొననున్నారు. అనంతరం ఏడుపాయల వనదుర్గా మాతను దర్శించుకోనున్నారు. అదేరోజు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ కౌడిపల్లి మండల పరిధిలోని తునికిలో గల కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శిస్తారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో మాట్లాడి సేంద్రియ వ్యవసాయం గురించి తెలుసుకుంటారు. ఈ ప్రాంతంలో ఎంతమంది రైతులు సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు..? దిగుబడి తదితర వివరాలను తెలుసుకోనున్నారు. ఇప్పటికే ప్రముఖుల షెడ్యూల్ ఖరారు కావడంతో ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం అయ్యారు. ఎలాంటి లోటుపాట్లు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు.



సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

సమన్వయంతో పనిచేయండి: సీఎస్

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ మెదక్ జిల్లా పర్యటన నేపథ్యంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డితో సీఎస్ శాంతి కుమారి శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమన్వయంతో పని చేసి పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 25 మధ్యాహ్నం 2.15 గంటల నుంచి 4.15 గంటల వరకు జిల్లాలో ఉపరాష్ట్రపతి పర్యటన ఉంటుందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్‌తో పాటు జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుపాయలలో ఎస్పీ పర్యటన

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో గవర్నర్, సీఎం పర్యటన నేపథ్యంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. మెదక్‌లోని సీఎస్‌ఐ చర్చి, ఏడుపాయల్లో పర్యటించి అధికారులతో చర్చించారు. షెడ్యూల్ ప్రకారం పర్యటన సాగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి


సంజీవరెడ్డి (ఫైల్)

సిద్దిపేటఅర్బన్: లారీ ఢీకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లి గ్రామ శివారులో శనివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సిద్దిపేట పట్టణానికి చెందిన అమ్మనగారి సంజీవరెడ్డి (59) రాయపోల్ మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. రోజూ లాగే బైక్‌పై సిద్దిపేట నుంచి రాయపోల్‌లోని పాఠశాలకు వెళ్తున్నాడు. తడ్కపల్లి శివారులోని సబ్‌స్టేషన్ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బావమరిది దయాకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి..


చెరువులో గురుపాదం మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): చెరువులో మునిగి మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట మండలం చెన్నాయిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పేట ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. చెన్నాయిపల్లి గ్రామానికి చెందిన గంగక్కోల గురుపాదం(30) శుక్రవారం రాత్రి గ్రామ సమీపంలోని కృష్ణాజీకుంటలో చేపల వేటకు వెళ్లాడు. తెల్లవారిన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా చెరువులో శవమై కనిపించాడు. భార్య రాధ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నోరూరించే ఫుడ్ ఫెస్టివల్


ఫుడ్ ఫెస్టివల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కాసులాబాద్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ నోరూరించేలా ఘుమఘుమలాడింది. వివిధ రకాల ఆహార పదార్థాలను విద్యార్థులు ప్రదర్శించారు. శుచి, శుభ్రత, నాణ్యమైన ఆహారాలను ఎంపిక చేసి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సరైన పోషకాహారం అందించడం వల్ల కలిగే లాభాలను తెలియజేయడానికే పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ గంగమణి, పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, సురేశ్, శివకుమార్, విద్యా ప్రకాశ్, రామచంద్రంతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిక్కు వీడితే.. లెక్క తేలికే




- విదార్థులతో మమేకమవుతూ వైవిధ్యంగా ఉపాధ్యాయుల బోధన
- వినూత్నంగా ఎగ్జిబిట్‌లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నేడు జాతీయ గణిత దినోత్సవం

విద్యార్థులు గణితం అంటే భయపడుతుంటున్నారు.. కానీ అర్థం చేసుకుంటే చాలా సులువంటున్నారు నిపుణులు. లెక్కలను భయంతో కాకుండా ఆసక్తితో నేర్చుకోవంటున్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో లెక్కలను సులభ పద్ధతిలో నేర్పిస్తున్నారు. విద్యార్థులు వాటిన అర్థం చేసుకొని పలు సైన్స్ ఫెయిర్‌లలో ఎగ్జిబిట్‌లను ప్రదర్శించి శభాష్ అనిపించుకున్నారు. నేడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

రాష్ట్ర స్థాయికి ఎంపికైన 'ఎగ్జిబిట్'


'ఎగ్జిబిట్'తో విద్యార్థి శ్రీకర్

మెదక్‌జోన్: జిల్లాలో గత నెల 29, 30 తేదీల్లో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌లో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు తయారు చేసిన 375 ఎగ్జిబిట్లను ప్రదర్శించగా అందులో 14 ఎగ్జిబిట్లు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. అందులో మెదక్ మండలం మాచవరం లోని రూరల్ సిద్దార్థ ఉన్నత పాఠశాలకు చెందిన జె.శ్రీకర్ 10వ తరగతి విద్యార్థి గణిత నమూనాను (టాన్జెంట్స్) ఎగ్జిబిట్‌ను తయారు చేయగా రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. విద్యార్థి మాటల్లో.. టాన్జెంట్స్ అనే పరికరాన్ని కేవలం కార్డ్ బోర్డుతోపాటు చార్ట్‌తోనే తయారు చేయటం జరిగింది. టాన్జెంట్స్ అనగా సపర్శరేఖలు అని అర్థం. దీన్ని గాట్‌రోడ్ల నిర్మాణాల సమయంలో దీనిని ఉపయోగిస్తారు. క్రాషింగ్(కరువుడు)లలో రెండు వైపులా కరువుడులో దీనిని అమర్చి రోడ్డు లైన్ వేస్తారు. టాన్జెంట్స్ లేకుండా గాట్ రోడ్డు వేయటానికి వీలు ఉండదు. అలాగే బ్రిడ్జిల నిర్మాణాల్లో సైతం దీనిని ఉపయోగిస్తారని చెప్పుకొచ్చారు.

లర్నింగ్ బై డూయింగ్‌తో..


మంత్రి దామోదర చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సిద్దారెడ్డి (ఫైల్)

సంగారెడ్డి జోన్: విద్యార్థులకు గణితాన్ని బోధించడం కాకుండా గణిత భావనలు అర్థమయ్యే విధంగా వారితో లర్నింగ్ బై డూయింగ్ (చేయడం వల్ల నేర్చుకోవడం) పద్ధతిని పాటింప చేస్తూ అభ్యాసం చేయించడం ద్వారా గణితం సులభంగా నేర్చుకునేందుకు వీలు ఉంటుంది. రాబోయే పదవ తరగతిలో సంఖ్యాక శాస్త్రం, వాస్తవ సంఖ్యలు, సంభావ్యత ఇలాంటి మూడు నాలుగు అధ్యాయాలు ప్రాక్టీస్ చేస్తే యావరేజ్ విద్యార్థి సైతం మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావచ్చు. గణిత శాస్త్రంలో బోధనలో ప్రత్యేకతనూ చాటుతూ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా, రాష్ట్ర స్థాయిలో పలు అవార్డులను కైవసం చేసుకుంటున్నారు పుల్‌కల్ మండలం కోర్పోల్ గ్రామంలో గణితశాస్త్ర ఉపాధ్యాయుడు సిద్దారెడ్డి. తాను నివాసం ఉంటున్న ఇంటినే గణిత ప్రయోగశాలగా ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో నిర్వహించే సైన్స్ ఫెయిర్‌లలో పాల్గొని, పలు అవార్డులను కైవసం చేసుకున్నారు.



ఇంట్లో ఉన్న గణిత ప్రయోగశాల

యంత్రాలతో లెక్కల తంత్రం


వినయ్‌కుమార్ తయారు చేసిన గణిత నమూనా

కొండాపూర్(సంగారెడ్డి): గణితం అంటే చాలా విద్యార్థుల్లో ఏదో తెలియని భయం. లెక్కలు చేయాలంటే తడబాటు ఉంటుంది. కానీ మన వినయ్‌కుమార్ సార్ బోధించే విధానాన్ని చూస్తే గణితం అంటే ఇంత సులభమా అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. 1వ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు ఎక్కాలను మొదలు నుంచి దేనినైనా సులభంగా నేర్చుకోవడానికి అవసరమైన నూతన పద్ధతులను శాస్త్రీయంగా రూపొందిస్తున్నారు. ఉప్పరి వినయ్‌కుమార్ ప్రస్తుతం నిజాంపేట మండలంలోని ర్యాలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్నారు.

తయారు చేసిన గణిత నమునాలు :

1. త్రిభుజంలో అంతర కోణాల మొత్తం 180 డిగ్రీలు నిరూపించుట
2. రహస్య మొత్తం అనే ద్వారా ఇచ్చిన మూడు అంకెల మొత్తాన్ని లిప్త పాటులో చెప్పే విధంగా పిల్లలను సంసిద్ధం చేసేందుకు యంత్రం
3. కోణాల రకాలను సులభంగా గుర్తించుకునేలా బోధించగలిగే యంత్రం
4. ఎక్కాలను సులభంగా అవగాహన పరిచే నమూనా తయారు చేసి బోధిస్తున్నారు.
5. మొదటి 'ఎన్' బేసి సంఖ్యలు, మొదటి 'ఎన్' సరి సంఖ్యల మొత్తానికి సూత్రాన్ని రాబట్టుట వంటి ప్రయోగాలను రూపొందించాడు. వీటికి గానూ ఇటీవలె జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో ఉపాధ్యాయ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఇదే కాకుండా విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యాభ్యాసం అనే అంశంపై జిల్లా నుంచి గుజరాత్‌లోని ఐఐటీ గాంధీనగర్‌లో ఇన్నోవేటివ్ కార్యక్రమంలో శిక్షణలో పాల్గొన్నాడు.

డిజిటల్ విధానంలో బోధన


డిజిటల్ విధానంలో బోధిస్తున్న లక్ష్మారెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణానికి చెందిన ఇందిరానగర్ ఉన్నత పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుడు లక్ష్మారెడ్డి అంటే ఆ పాఠశాల విద్యార్థులకు చాలా ఇష్టం. ఎందుకంటే గణితం అంటే భయం ఉండే విద్యార్థుల్లో ఇట్టే భయం పోగొట్టేశాడు. వారితోనే లెక్కల సమస్యలను సులభంగా చేసేలా చేస్తాడు. కేవలం బోర్డు పైనే కాకుండా విద్యార్థులను మౌఖికంగా గణితం నేర్చుకునేలా చేయడంలో కృషి చేస్తున్నాడు. ప్రతీ సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులకు గణితంలో 10 జీపీఏ సాధించటంలో లక్ష్మారెడ్డిది కీలక పాత్ర.

రాష్ట్ర స్థాయికి టైప్స్ ఆఫ్ యాంగిల్స్ ప్రాజెక్టు

నవంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో దుబ్బాక కేజీబీవీ గణిత టీచర్స్ చంద్రకళ ఆధ్వర్యంలో విద్యార్థిని మధుప్రియ ప్రదర్శించిన టైప్స్ ఆఫ్ యాంగిల్స్ రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైంది. విద్యార్థులకు యాంగిల్స్ సులువుగా అర్థమవ్వడమే కాకుండా, అవి ఏ విధంగా నిర్ధారించవచ్చునో పటాల ద్వారా వివరించారు.


ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న మధుప్రియ, గైడ్ టీచర్ చంద్రకళ

లెక్కల్లో ప్రతిభ.. ఉజ్వల భవిత


విద్యార్థి భవిత

చిన్నకోడూరు(సిద్దిపేట): గణితం అంటే చిన్నారుల మొదలు పెద్దల వరకు ఎంతో కొంత భయం ఉండటం సాధారణం. లెక్కలంటే ఆ విద్యార్థిని లెక్క చేయకుండా లెక్కల్లో రాణిస్తుంది. చిన్నకోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కే.భవిత. చిన్న నాటి నుంచి లెక్కల్లో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తుంది. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో గణిత నమూనాలు-గణనలో పాల్గొని జిల్లా స్థాయిలో రెండో స్థానం నిలిచింది. లెక్కలు అవలీలగా చేస్తుంది. పలువురు అభినందించారు.

పట్టిక.. సులభమే లెక్క


పట్టికతో ఉపాధ్యాయుడు పోచయ్య

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థులకు సులువుగా అర్థం అయ్యేలా గణిత బోధన కోసం పట్టికలను రూపొందించి శభాష్ అనిపించుకుంటున్నాడు చిన్నశంకరంపేట జెడ్పీపాఠశాల గణిత బోధకుడు కర్రె పోచయ్య. ఈ పట్టికతో 0 నుంచి 9 వరకు ఉన్న అంకెలతో సులభంగా గుణకారం, భాగాహారంను గణించకుండానే తెలుసుకోవచ్చు. ఈ పట్టికను ఉపయోగించి లెక్కలు చేయకుండానే సలుభంగా జవాబు చెప్పవచ్చని ఉపాధ్యాయుడు పోచయ్య వివరించారు. విద్యార్థులకు గణితంపై ఉన్న భయం తొలగిపోవడంతో పాటు ఆసక్తి చూపుతారన్నారు.

ఆడుతూ.. పాడుతూ లెక్కలు



జాయ్ ఫుల్ లెర్నింగ్ బై మ్యాథ్స్ గేమ్స్ ప్రాజెక్టు

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని సిర్సనగండ్ల హైస్కూల్లో గణిత ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న రూపారాణి గైడెన్స్‌లో విద్యార్థి బీ. వినయ్ ప్రదర్శించిన ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. గణితం సబ్జెక్ట్ అంటేనే భయపడే విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ఈజీగా ఆడుతూ నేర్చుకునే దిశగా జాయ్ ఫుల్ లెర్నింగ్ బై మ్యాథ్స్ గేమ్స్ ప్రాజెక్టును తయారు చేసి జిల్లా స్థాయి సైన్స్‌పెయిర్ ఎగ్జిబిషన్‌లో ప్రశంసలు అందుకొని రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. విద్యార్థులు ఆటా పాటలతో సులభతరంగా గణితం సబ్జెక్టును నేర్చుకునేందుకు సెపరేషన్ ఆఫ్ నంబర్స్, మాగ్నిఫికేషన్ లాంటి ప్రాజెక్టు దోహదపడేలా తయారు చేసి ప్రదర్శించారు.

గణితంలో భువన విజయమే


భువనకు అవార్డు అందిస్తున్న ఎమ్మెల్సీ, డీఈఓ

దుబ్బాక: దుబ్బాక మండలం చీకోడ్ జెడ్పీహెచ్ఎస్‌లో పదవ తరగతి చదువుతున్న కె.భువన గణితంలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ అందరితో శభాష్ అనిపించుకుంటుంది. ఇటీవలె రాష్ట్ర గణిత ఫోరమ్ ఆధ్వర్యంలో గజ్వేల్ మండలం కొడకండ్లలో నిర్వహించిన గణితం టాలెంట్ టెస్టులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ఇటీవలె అవార్డు అందుకోవడం విశేషం. అలాగే, రాష్ట్రస్థాయి గణితం టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి గణితం టాలెంట్ టెస్ట్‌లో సత్తా చాటేందుకు భువన సిద్ధమైంది. హెచ్‌ఎం జానకీరామ్, మాథ్స్ టీచర్ పొలాస మధు ప్రత్యేకంగా అభినందించారు.

రావి ఆకుపై సూత్రాలు



నారాయణఖేడ్: డిసెంబరు 22న శ్రీనివాసన్ రామానుజన్ జయంత్రి సందర్భంగా నారాయణఖేడ్ పట్టణానికి చెందిన పత్ర చిత్రకారుడు గుండు శివకుమార్ రావి ఆకులపై శ్రీనివాస రామానుజన్ చిత్రాలు, రామానుజన్ సంఖ్య, గణిత సూత్రాలను మలచి గణిత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులతోనే చేయిస్తాడు


విద్యార్థులతో వేయించిన బహుభుజి మ్యాప్


బోధిస్తున్న ఉపాధ్యాయుడు యాదాగౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థులకు గణితాన్ని సులభ పద్ధతిలో బోధించడం అతడి ప్రత్యేకత. మండల పరిధిలోని సోమక్కపేట్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు యాదాగౌడ్. ఉపాధ్యాయుడు చెప్పే గణిత మెలకువలకు విద్యార్థులు ఆకర్షితులయ్యారు. విద్యార్థులకు గణిత సమస్యలు అర్థమయ్యేలా చార్ట్‌లు, ప్రయోగాత్మకంగా బోధిస్తాడు. పలు రకాల గణిత సమస్యలు విద్యార్థులతోనే చేయించి, వారికి అర్థమయ్యే పద్ధతిలో బోధించడం ప్రత్యేకత. ఎలాంటి ప్రాబ్లమ్‌పైనా సులభ పద్ధతిలో బోధిస్తూ, తనదైన శైలిలో గణితంలో రాణిస్తున్నాడు. ఈ మధ్యనే బదిలీపై రేగోడ్ నుంచి వచ్చాడు.

నిండు ప్రాణాన్ని బలిగొన్న అప్పులు

- రూ.కోటి రుణం తీర్చ లేక మనస్తాపం
- మంజీరా నదిలో దూకి ఆత్మహత్య
- సదాశివపేటలో విషాదం


ప్రశాంత్ (ఫైల్)

సదాశివపేట(సంగారెడ్డి): రూ.కోటి వరకు అప్పులు, వడ్డీ.. ఎలా తీర్చాలో తెలియక యువకుడు మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన జిల్లా సదాశివపేటలో వెలుగుచూసింది. సదాశివపేట సుభాశ్‌రోడ్డులో పదేళ్ల క్రితం ల్యాకాజీ ప్రశాంత్ (35) ప్రశాంత్ పార్టనర్లతో కలిసి జనరల్ ఫైనాన్స్, డైలీ ఫైనాన్స్ కంపెనీ ప్రారంభించారు. మూడేళ్ల క్రితమే ఫైనాన్స్ సంస్థ మూసివేశారు. రెండేళ్ల క్రితం ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ కలహాలు మొదలయ్యాయి. గతేడాది భార్య రవళి, కూతురు, కుమారుడితో కలిసి తాను సంగారెడ్డి పట్టణం బైపాస్ రోడ్డుకు అనుకుని ఉన్న కాలనీకి మకాం మర్చారు. అక్కడ డైలీ ఫైనాన్స్ నిర్వహిస్తున్నట్లు స్నేహితులు కుటుంబ సభ్యులకు చెప్పేవాడని తెలిసింది. ఈ క్రమంలో పేకాట, బెట్టింగ్‌లకు అలవాటు పడి ప్రైవేటు వ్యక్తులు, స్నేహితుల వద్ద సుమారుగా రూ.కోటి వరకు అప్పులు చేసినట్లు సమాచారం. తీసుకున్న అసలు, దానికి వడ్డీ చెల్లించకపోవడంతోపాటు కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది పుల్‌కల్ మండలంలో ఉన్న సింగూర్ డ్యామ్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సందర్భంగా ప్రైవేట్ వ్యక్తులకు చెల్లించాల్సిన అప్పుల వారి గురించి తన భర్త తెలుపలేదని, కుటుంబ కలహాలు ఆర్థిక ఇబ్బందులతోనే ప్రశాంత్ ఆత్మహత్య చేసుకున్నాడని, భార్య రవళి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సంగారెడ్డి రూరల్ ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి తెలిపారు.

తెలంగాణ అబ్బాయి.. అమెరికా అమ్మాయి

మూడు ముళ్ల బంధంతో ఒక్కటైన జంట


నూతన వధూవరులు

సిద్దిపేటఅర్బన్: తెలంగాణకు చెందిన అబ్బాయి అమెరికాకు చెందిన అమ్మాయి వివాహ బంధంతో ఒక్కటయ్యారు. సిద్దిపేట పట్టణానికి చెందిన వద్దేపల్లి సురేంద్రనాథ్–అండాలు దంపతుల రెండో కుమారుడు శ్రీనాథ్ 15 ఏళ్లుగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఈ క్రమంలో టెన్నిస్ రాష్ట్రానికి చెందిన పీడియాట్రిక్ డాక్టర్ క్రిస్టల్‌తో ప్రేమలో పడ్డాడు. ఐదేళ్లుగా ప్రేమించుకుంటున్న వీరు శనివారం వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. క్రిస్టల్ క్రిస్టియన్ మతానికి చెందినప్పటికి హిందూ సంప్రదాయంలో వివాహం చేసుకోవడం విశేషం. పొన్నాలలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన వీరి వివాహానికి క్రిస్టల్ తల్లిదండ్రులతో పాటు స్నేహితులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

8 తులాల బంగారు, 22 తులాల వెండి అపహరణ

సిద్దిపేటకమాన్: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. శనివారం టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో బండి యాదగిరి కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇంటికి తాళం వేసి పని నిమిత్తం బయటకెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికొచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని 8 తులాల బంగారు, 22 తులాల వెండి ఆభరణాలతోపాటు రూ.18 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి మెడలో నుంచి గొలుసు..

ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన సిద్దిపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. పట్టణ శివారు గుండ్లచెరువుకు చెందిన గరిపల్లి యాదవ్వ (60) ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. శనివారం గుర్తు తెలియని వ్యక్తి మాస్క్ ధరించి ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలో నుంచి తులం బంగారు గొలుసు లాక్కెళ్లాడు. గొలుసు కిందపడిపోగా, మిగతాది దుండగుడు ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా అరెస్టు

- రూ.కోటి విలువైన మత్తుపదార్థం పట్టివేత
- నూతన సంవత్సర వేడుకల కోసం హైదరాబాద్‌లో విక్రయించేందుకు..
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రూపేశ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రూపేశ్

పటాన్‌చెరు టౌన్: నూతన సంవత్సర వేడుకల కోసం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో డ్రగ్స్ విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న అంతరాష్ట్ర డ్రగ్స్ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.కోటి విలువైన 1000 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రూపేశ్ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీ చైతన్యతో కలసి శనివారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నార్కోటిక్స్ బ్యూరోకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక పోలీసులతో కలిసి శుక్రవారం సాయంత్రం పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్ జాతీయ రహదారి సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా..అదుపులోకి తీసుకొని విచారించారు. ఇందులో మహారాష్ట్ర రాజధాని ముంబైకి చెందిన అబ్దుల్ హమీద్ షేక్, ముఖేష్ దూబే అనే ఇద్దరు వ్యక్తులు నూతన సంవత్సర వేడుకల కోసం హైదరాబాద్‌లో స్థానికుడు షేక్ అమీర్ కోసం వెయ్యి గ్రాములు తీసుకొని వచ్చినట్లు తెలిపారు. వీరిద్దరూ ఢిల్లీలో ఉంటున్న జెమ్మీ, జిన్నీ అనే నైజీరియన్ల వద్ద కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడించారు. ఢిల్లీలో గ్రాముకి వేయి రూపాయలకు కొనుగోలు చేసి.. హైదరాబాద్‌లో రూ.4 వేల నుంచి 5 వేలకు విక్రయిస్తున్నారని తెలిపారు. వీరితోపాటు ముంబైకు చెందిన రాయిస్‌ఖాన్ అనే వ్యక్తి సైతం నిషేధిత డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు నేరస్తుల ద్వారా తెలిసిందని తెలిపారు. కొనుగోలుదారులను సైతం గుర్తించామని త్వరలోనే వారిని కూడా పట్టుకుంటామన్నారు. నిందితుల నుంచి రూ.కోటి విలువైన ఎండీఎం, నాలుగు మొబైల్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను ఎన్‌డీపీఎస్ చట్టం కింద ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఢిల్లీలో వీరికి డ్రగ్స్ విక్రయించిన జెర్రీ,జిమ్మీ, రైస్ రియాజ్ ఖాన్ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. ఎవరైనా డ్రగ్స్ తయారు, రవాణా, విక్రయిస్తున్న సమాచారం తెలిస్తే వెంటనే జిల్లా నార్కోటిక్ బ్యూరో (87126 56777) నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. సమావేశంలో డీఎస్పీలు శ్రీధర్, రవీందర్ రెడ్డి, సీతారాం, పటాన్‌చెరు సీఐలు వినాయక్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.